క్లుప్తంగా

రక్షణగోడకు మరమ్మతులు చేయాలి



రక్షణ గోడ కోతకు గురి కావడంతో నీటమునిగిన పొలాలు

మాకవరపాలెం : తుపాను వర్షాలకు కోతకు గురైన రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని జీకో డూరు గ్రామంలో ఉన్న జాగారం గెడ్డ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుంది. గతేడాది వర్షాలకు ఈ గెడ్డ నుంచి పంట భూములకు రక్షణగా నిర్మించిన గోడ కోతకు గురైంది. మరలా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గెడ్డ ఉధృతికి పక్కన ఉన్న భూములు నీట మునిగాయి. ఆక్రమణల కారణంగా ఈ గెడ్డ కుదించుకుపోయిందని, అందుకే రక్షణగోడ కోతకు కోతకు గురైందని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గెడ్డ ఆక్రమణలు తొలగించడంతో పాటు కోతకు గురైన రక్షణగోడకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం : మండల కేంద్రంలోని లాలం వారి వీధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీగణపతి యూత్ ఆధ్వర్యంలో ఏటా వినాయక మండపం ఏర్పాటు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా వినాయకుడిని నలిపి శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు.

కె.కోటపాడు : కె.కోటపాడు, గొండుపాలెం గ్రామాల్లో వినాయక మహోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం అన్నసమారాధన జరిపారు. గొండుపాలెంలో సర్పంచ్ లక్ష్మణ రావు, ఎంపీటీసీ నారాయణమ్మ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో శుక్రవారం భారీ అన్న సమారాధన చేపట్టారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిన బజారు వీధిలో మహిళా సంఘం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయగా వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



రవీంద్రబాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట : ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన తురకలపూడి హెచ్ఎం జె.రవీంద్రబాబును తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఇటీవల ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉన్నత విద్యకు కృషి చేస్తున్న రవీంద్రబాబు ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం సాయంత్రం పాఠశాలతో పాటు పలువురు మండల ఉపాధ్యాయులు రవీంద్రబాబును ఘనంగా సత్కరించి అభినందించారు.

పీఏసీఎస్‌లో రికార్డుల తనిఖీ



రోలుగుంట పీఏసీఎస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీసీబీ సీఈవో వర్మ

రోలుగుంట : రికార్డుల్లో అధికారుల తనిఖీ సమయంలో సమాచారం సమగ్రంగా ఉండాలని డీసీసీబీ సీఈవో డి.వి.ఆర్.వర్మ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పీఏసీఎస్‌ను ఆయన నర్సీపట్నం సెంట్రల్ బ్యాంకు మేనేజర్ ఎల్.కె.ఎన్.నాయుడుతో కలసి శుక్రవారం సందర్శించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. పీఏసీఎస్ సీఈవో మహేష్‌తో బ్యాంకులో ఇస్తున్న దీర్ఘకాలిక, వ్యవసాయ రుణాలు, ఆభరణాల రుణాలు మంజూరు, జమలు, కార్యాలయ నిర్వహణపై చర్చించారు. రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో బహుళ ప్రయోజనాలు

- వరి, చెరకుతో పాటు ఉద్యాన వంటలకు బీమా వర్తింపు
- ఇప్పటి వరకూ 91 శాతం నమోదు
- రేపటితో గడువు పూర్తి



అడ్డసరం ఆర్‌బీకేలో రైతు పంట వివరాలు నమోదు చేసుకుంటున్న వ్యవసాయ సిబ్బంది



గుండుబాడుల్లో వరిపొలాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట : మండలం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు మేలు చేసే ఈ-క్రాప్ నమోదు జోరందుకుంది. ఈ క్రాప్‌తో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. ప్రతి రైతు తన పంట భూమిలో సాగు చేపట్టిన ప్రతి పంటను ఈ-క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తిస్తాయి. రైతుల పంటలకు ప్రభుత్వమే బీమా రుసుము చెల్లిస్తోంది. రైతు చెయాల్సింది వ్యవసాయాధికారుల వద్ద తాను సాగుచేస్తున్న పంటల వివరాలను విధిగా నమోదు చేయించుకోవాలి. ఈ ఏడాది వరి.చెరకు సాధారణ విస్తీర్ణం 4,684 ఎకరాలు కాగా 4,109 ఎకరాల్లో గ్రామస్థాయి వ్యవసాయాధికారులు ఈక్రాప్ నమోదు చేశారు. ఉద్యాన, సెరీకల్చర్ సాధారణ విస్తీర్ణం 9,592 ఎకరాలు కాగా 8,862 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదై 91 శాతం పూర్తయింది.

ఇవీ ప్రయోజనాలు..

- ఈ క్రాప్ నమోదు వల్ల పంటల బీమా వర్తిస్తుంది.
- వరి పంట ఈ క్రాప్ నమోదు చేయించుకుంటేనే ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అమ్మకం చేసుకునే అవకాశం ఉంటుంది.
- బ్యాంకు రుణాలు వర్తిస్తాయి.
- అన్నదాత సుఖీభవ పథకం కూడా వర్తిస్తుంది.
- మండల వ్యవసాయ శాఖ ఆగస్టు తొలివారంలో చేపట్టిన ఈ-క్రాప్ నమోదు ఈ నెల 15 వరకే గడువు ఉంది. గడువు లోపున ప్రతి రైతు తమ అధార్ కార్డు, భూసాగు విస్తీర్ణంలో రకాల వారీగా సాగు చేసిన పంటల విస్తీర్ణం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పంట పొలాలను సందర్శిం,చడం, ఏమేర రైతులు ఈక్రాప్ చేయించుకున్నారో రైతుల పంట భూములను సందర్శించి, రైతులను కలసి వివరాలు తెలుసుకోవడంతో పాటు ఆర్బీకేలో నమోదైన ఈ క్రాప్ ఏ రోజుకారోజు తెలుసుకుంటున్నారు. రైతులను సిద్ధపరస్తూ, తమ సిబ్బందికి త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన సూచనలు చేస్తున్నారు.

వరి, చెరకు సాగు చేస్తున్నా..



కొండపాలెం రెవెన్యూ పరిధిలో రెండు ఎకరాల్లో వరి, ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగు చేశాను. మండల వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పంటల వివరాలను అందజేసి ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నాను.

-కోలా రాము, రైతు, కొండపాలెం

రుణం కావాలంటే ఈక్రాప్ నమోదు తప్పనిసరి



బాంకుల్లో రుణాలు తీసుకోడానికి ఈ-క్రాపు నమోదు కావాలి. అంట్లపాలెం గ్రామంలో నేను ఎకరాన్నర భూమిలో వరి సాగు చేస్తున్నాను. వ్యవసాయ కార్యాలయ అధికారి నా సాగు వివరాలు నమోదు చేసుకున్నారు. నేను బ్యాంకులో రుణం కోసం వెళ్లగా ఈ క్రాప్ వివరాలు అడిగారు. ఈ క్రాప్ నమోదు అవసరం ఎంతైనా ఉంది.

-కాగిత సింహాచలం రైతు, అంట్లపాలెం

గడువులోగా ప్రతి రైతు నమోదు చేసుకోవాలి



ఈ క్రాపు నమోదు ప్రతి రైతు చేయించుకోవాలి. రైతు భరోసా కేంద్రంలో పని చేస్తున్న గ్రామ స్థాయి వ్యవసాయాధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 వరకూ గడువు ఉంది. రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలి. పంటల వివరాలు నమోదు తరువాత థంబ్ వేయాలి.

-ఎస్.విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి

బదిలీ అయిన ఎస్‌ఐల బాధ్యతల స్వీకారం



ఎస్ఐ రామకృష్ణ



ఎస్ఐ లక్ష్మీ నారాయణ

రోలుగుంట : రోలుగుంట ఎస్ఐగా పి.రామకృష్ణ శుక్రవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకూ ఆయన నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా రోలుగుంట స్టేషన్‌కు బదిలీ అయి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ వైఎస్సార్ జిల్లా వాకుంపేటకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తనకు ఈ మండలంతో సంబంధం ఉందన్నారు. ఇదే మండలంలో గతంలో కొన్ని కేసుల్లో ఇక్కడ నుంచి బదిలీ అయి వెళ్లిపోయిన కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఉన్న సమయంలో ఆయన అదేశాలతో నేరస్తులను పట్టుకోవడంలో తన సేవలందించడం జరిగిందన్నారు. చట్టబద్ధంగా తన విధులు నిర్వహిస్తూ, ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు గంజాయి పూర్తి స్థాయి అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు .అందుకు సిబ్బంది సహకాకరం తీసుకుంటానన్నారు. గ్రామాల్లో నేరాలు, ఘోరాలు అరికట్టేందుకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం కావాలన్నారు.

కోడూరు ఎస్ఐగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకారం

కె.కోటపాడు : ఎ.కోడూరు ఎస్ఐగా డి.లక్ష్మీనారాయణ శుక్రవారం విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కె.కోటపాడు ఎస్ఐగా పని చేస్తున్న ఆయనను ఎ.కోడూరు ఎస్ఐగా బదిలీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసర గ్రామాల్లో ప్రజలను సమన్వయం చేసుకుంటూ పోలీసు సిబ్బంది సహాయంతో శాంతి భద్రతలను కల్పించేందుకు చర్యలను తీసుకుంటానని ఎస్ఐ లక్ష్మీనారాయణ అన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను అరికడతామన్నారు. నూతన ఎస్ఐకి పోలీస్‌స్టేషన్ సిబ్బంది శుభాకాక్షలు తెలిపారు.

15వ తేదీ లోగా ఈకేవైసీ చేసుకోండి



పెదమదీనలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో భాస్కరరావు

బుచ్చెయ్యపేట : రైతులందరూ తమ పంటలకు 15వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు. శుక్రవారం ఆయన పెదమదీన, గున్నెంపూడి, కొండపాలెం తదితర గ్రామాల్లో రైతుల పంట పొలాలను పరిశీలించారు. ప్రభుత్వం ఎవరైతే పంటలు సాగు చేస్తున్నారో వారి పేరు మీదనే పంట నమోదు చేసి ఈకేవైసీ చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. మండలంలో 1,400 ఎకరాలకు ఇప్పటి వరకు 9,600 ఎకరాల్లో మాత్రమే పంట నమోదు జరిగిందని మిగిలిన రైతులు పంట నమోదు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

నర్సీపట్నం డివిజనల్ అభివృద్ధి అధికారి ఉదయశ్రీ



ఎం.కోటపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

మాడుగుల రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని నర్సీపట్నం డివిజనల్ అభివృద్ధి అధికారి డీఎల్‌డీఓ ఎం.ఉదయశ్రీ పేర్కొన్నారు. మండలంలో ఎం.కోటపాడు గ్రామంలో శుక్రవారం గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. సచివాలయం సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసి, అక్కడ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. కేంద్రాలకు ఎక్కువ మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. హెల్త్‌నెస్ కేంద్రంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపాలరావు, మండల పంచాయతీ విస్తరణాధికారి పి.ఎస్.ఎల్.వి. మీనాకుమారి, గ్రామ సర్పంచ్ శానాపతి శేషఫణి, ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్, పంచాయతీ కార్యదర్శి పి. తిరుమలదేవితో పాటు సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కె.కోటపాడు : కె.కోటపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. సమావేశానికి విధిగా మండల స్థాయి అధికారులు వారి శాఖల నివేదికలతో హాజరుకావాలని అప్పలరాజు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీల ద్వారా మెరుగైన పోషకాహారం



కె.జె.పురంలో బాలింతలు, గర్భిణులకు బాలసంజీవిని ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్ : గర్భిణులు, బాలింతలుకు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. కె.జె.పురంలో 1 వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్రను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కిచెన్ గార్డెన్‌ను, పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు బాలసంజీవిని, ఇతర కిట్లును అందజేశారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శి పెంకి శివ, సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యురాలు చిన్నంలోవతల్లి, దాలిబాబు, పంచాయతీ వార్డు సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వితరణ

చోడవరం రూరల్ : వరదలకు నష్టపోయిన కుటుంబాలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది రేషన్ అందించి ఆదుకున్నారు. శుక్రవారం పట్టణంలోని ద్వారకానగర్‌లో వర్షాలకు నీట మునిగిన 55 కుటుంబాలను గుర్తించి ఒక్కో కుటుంబానికి 5 కిలోల చొప్పున బియ్యం, ఆరకిలో కందిపప్పు , ఆరకిలో గోధమరవ్వతో కూడిన కిట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎస్ మూడు యూనిట్లు బాధిత కుటుంబాలను గుర్తించి సహాయానికి విరాళాలు సేకరించారు. ఇంచార్జి ప్రిన్సిపాల్ సత్యవతి నేతృత్వంలో విద్యార్థులు కిట్లు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



అవార్డు గ్రహీత అమృతరావును దుస్సాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న హెచ్ఎం

కె.కోటపాడు : అంకిత భావంతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వహిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జె.అమృతరావు అభినందనీయులని ఎ.కోడూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు అన్నారు. పాఠశాలలో శుక్రవారం అమృతరావుకు హెచ్ఎం కామేశ్వరరావు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. అమృతరావును దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా అమృతరావు మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధను చూపుతూ వారు చదువుల్లో రాణించేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, ఎరుకునాయుడు, రమాదేవి, పద్మావతి, మహేష్, అర్జున్, బంగారునాయుడు, పైడయ్య, వెంకటరావు, సన్యాసయ్య పాల్గొన్నారు.

వై.బి.అగ్రహారంలో వైద్య శిబిరం

నాతవరం : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రధర్ అన్నారు. మండలంలో వై.బి. అగ్రహారం గ్రామంలో శుక్రవారం సర్పంచ్ కోసూరి విజయ అధ్యక్షతన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈవైద్య శిబిరంలో 100మందికి పైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంతమందికి రక్త పరీక్షలు చేసి అనంతరం పలు సూచనలు చేశారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీళ్లు తాగాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జి.వెంకటలక్ష్మి ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

17న నులిపురుగుల నివారణ కార్యక్రమం

నాతవరం : ఈనెల 17వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎస్. హనుమంతరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల కార్యక్రమం గోడ పత్రికను పీహెచ్‌సీ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారం లోపం, ఆకలి మందగించడం , కడుపునొప్పి, వాంతులు, బరువు తగ్గడం వంటి లక్షణాలు కన్పిస్తాయన్నారు. వీటి నిర్మూలనకు ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అల్బెండజోల్ టాబ్లెట్స్ వేస్తారన్నారు.

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి

మాడుగుల రూరల్: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశు వైద్యశాలలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి, మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతామని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో తాగు నీటి సమస్య, ఆస్పత్రి ఆవరణలో తుప్పలు, దొంకలు పెరిగిపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులను ప్రధాన వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఆస్పత్రిలో మందుల కొరత ఉందని, టైఫాయిడ్ కిట్లు సరఫరా కాలేదని తెలిపారు. ఈ విషయమై త్వరలో మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ పేర్కొన్నారు. అనంతరం కె.జె.పురంలో గల పశువైద్య పర్యవేక్ష కేంద్రాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ జామి రమణబాబు, వార్డు సభ్యుడు సూరిశెట్టి గోవిందరాజులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమంలో ఏచూరిది చెరగని ముద్ర



రామన్నపాలెంలో సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేత దొర తదితరులు



వొమ్మలిలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



కె.కోటపాడులో సీతారాం ఏచూరికి నివాళి అర్పిస్తున్న నాయినిబాబు తదితరులు

దేవరాపల్లి : కమ్యూనిస్టు ఉద్యమంలో సీతారాం ఏచూరి చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సీపీఎం మండల కార్యదర్శి బి.టి. దొర అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాప కార్యక్రమాన్ని వాలాబు పంచాయతీ శివారు రామన్నపాలెంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.శంకర్, పొట్టంగి భీమన్నదొర, కాశీ సుధాకర్ పాల్గొన్నారు.

మాడుగుల : వొమ్మలి గ్రామంలో శుక్రవారం సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నర్సింహంమూర్తి ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేసిన కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరని కొనియాడారు. ఏచూరి భౌతిక కాయాన్ని ఆయన అభీష్టం మేరకు ఎయిమ్స్ బోధన పరిశోధన నిమిత్తం అప్పగించడం ఆయన ప్రజా సేవా తత్పరతకు నిదర్శన మన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. వేచలపు నూకాలమ్మ, పెద దేముడు, రాములమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి ఎల్లప్పుడూ శ్రమజీవుల మేలు కోసం తపించారని సీపీఎం జిల్లా నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. సీతారం ఏచూరి మరణంపై కె.కోటపాడులో శుక్రవారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీకి ఏచూరి చేసిన కృషిని నాయినిబాబు వివరించారు. యర్రా దేముడు, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని చిన కోనాంలో సీపీఎం నేతలు ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఆర్.దేముడు నాయుడు మాట్లాడుతూ సీతారాం ఏచూరి బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో ఉద్యమాలు చేసి,అలుపెరుగని పోరాటం చేశారన్నారు. అణగారిన వర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు.

కాంట్రాక్టు నర్స్‌లను క్రమబద్ధీకరించాలి



ఎమ్మెల్యే బండారుకు వినతిపత్రం అందిస్తున్న స్టాఫ్ నర్సులు

కె.కోటపాడు : పదిహేనేళ్లుగా స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న తమను క్రమబద్ధీకరించేలా జరిగేలా సహకారం అందించాలని కె.కోటపాడు సీహెచ్‌సీ స్టాఫ్ నర్సులు కోరారు. చౌడువాడలో శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని కలిసిన స్టాఫ్ నర్సులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సు ధన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ స్టాఫ్ నర్సులకు నష్టం కలిగించే జీవో నంబర్ 115ను రద్దు చేయాలని ఆమె కోరారు. ఐదు రోజులుగా సమస్యల పరిష్కారం కోరుతూ రోగులకు ఇబ్బందులు లేకుండా విధులను కొనసాగిస్తూ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్టు ఆమె తెలిపారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో దివ్యసత్య, అప్పలనర్స, ప్రధాని, పుష్పకళ, రేవతి, నాగమణి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం చక్కదిద్దాలి



బోయిలకింతాడలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి : ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని దేవరాపల్లి ఎంపీడీవో కె.చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు బోయిలకింతాడ, కలిగొట్ల గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. బోయిలకింతాడలో స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎడతెరిపి లేని వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అన్ని గ్రామాల్లో చెత్తాచెదారాలను తొలగించడంతో పాటు డ్రైనేజీల్లో పూడిక తీయాలని సూచించారు. మంచినీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఆయన సూచించారు. బోయిలకింతాడ, కలిగొట్ల గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించడంతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ రెండు గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకంలో వంటకాలను రుచి చూశారు. మెనూ ప్రకారం నాణ్యమైన వంటకాలను పెట్టాలని స్థానిక ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా పెడుతున్నారా లేదా అని ఎంపీడీవో చంద్రశేఖర్ స్థానిక విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జామి అప్పారావు, స్థానిక పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులు బాగుచేయరూ...



కొత్తకోట హైస్కూల్ వద్ద రోడ్డుపై గోతుల వద్ద ఆటోలతో నిరసన చేస్తున్న ఆటో డ్రైవర్లు

చోడవరం : ప్రాణాంతకంగా మారిన బీఎన్‌రోడ్డు గోతులను వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ రావికమతం మండలం కొత్తకోట శ్రీ శాంతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. దొండపూడి చెక్‌పోస్టు నుంచి కొత్తకోట వరకూ ఆటోలతో నిరసన ప్రదర్శన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కొత్తకోట హైస్కూల్ వద్ద పెద్దపెద్ద గోతులతో చోడవరం-నర్సీపట్నం (బీఎన్)రోడ్డు చాలా ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డుపై ఆటోలు, ద్విచక్రవాహనాలపై వెళ్లడం చాలా ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితుల్లో వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని కోరుతూ ఆటో డ్రైవర్లు ఆందోళన చేశారు. వర్షాలు గోతులన్నీ నూతులుగా మారిపోవడంతో ఆటోలో ప్రమాదాలకు గురై ప్రయాణికుల ప్రాణాలకు సైతం ప్రమాదం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని, తక్షణం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల టి.అర్జాపురం వద్ద రోడ్డుపై నీటితో నిండిన గోతులో పడి ఒక వ్యక్తి మృతిచెందాడని, అయినా ఆర్అండ్‌బీ అధికారులు గాని ప్రభుత్వం గాని ఏమీ పట్టించుకోలేదని ఆటో డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం రోడ్డును బాగుచేయాలని కోరారు.